విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

బుధవారం 15 అక్టోబరు 2025 8 పేజీలు

"చలో ఐటీడీఏ" విజయవంతం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

విశాలాంధ్ర - కుక్కునూరు/ వేలేరుపాడు : ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య కోరారు. మంగళవారం కుక్కునూరు మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు పూరెం లక్ష్మయ్య అధ్యక్షతన సీపీఐ మండల కార్యవర్గ, కౌన్సిల్ సమావేశం, సీపీఐ వేలేరుపాడు కార్యాలయంలో రామవరం సర్పంచ్ పిట్ట ప్రసాద్ అధ్యక్షతన సీపీఐ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణచైతన్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 78 ఏళ్లు గడుస్తున్నా గిరిజనుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని పేర్కొన్నారు.

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న ప్రభుత్వాల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముప్పై ఏళ్ల నుంచి పోడు భూములు సాగు చేస్తున్న గిరిజ నులు, వలస గిరిజను లకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలీన మండలాల్లోని గిరిజను లకు ఎస్టీ కుల ధ్రువీ కరణ పత్రాలు ఇవ్వడంలో రెవెన్యూ యంత్రాంగం కుంటిసాకులతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో గిరిజనులకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, అర్హులైన గిరిజ నులు ఉద్యోగాలు కోల్పోతున్నారని తెలిపారు. గిరిజన గ్రామాలకు వసతులు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 2004లో మొదలైన భూసేకరణ ఇప్పటివరకు కొలిక్కి రాలేదన్నారు. నిర్వాసితులను తగ్గించాలని కుట్రతో బహుళార్ధక సాధక ప్రాజెక్ట్ డ్యామ్ ▶మిగతా 2లో..

ఎస్ఈజెడ్ భూములకు రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ ఎస్ఈజెడ్ భూములు రైతుల పేరును బదిలీ ప్రక్రియకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ..స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకినాడ కేఎస్ఈజెడ్ రైతులకు అనుకూ లంగా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయం తీసుకుందన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. కాకినాడ ఎస్ఈజెడ్ లిమిటెడ్ ద్వారా రైతులకు ▶మిగతా 2లో..

భద్రతపై ఫ్యాక్టరీలు ప్రత్యేక దృష్టి

- ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు
- మాక్ డ్రిల్లులు, భద్రతా మాన్యువల్ తప్పనిసరి
- కలెక్టరు కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు: జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి పారిశ్రామిక భద్రతా కమిటీ, క్రైసిస్ గ్రూపుల కమిటీ సమా వేశాన్ని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, సేఫ్టీ అధికారులతో కలసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతననిర్వహించారు. జిల్లాలో ఎ కేటగిరి 04, బి 1 కేటగిరి 26, బి2 కేటగిరి 06 మొత్తం 36 పరిశ్రమల మీద భద్రతా ప్రమాణా లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఫ్యాక్టరీకి తప్పనిసరిగా భద్రతా అధికారిని నియమించి, అత్యవ సర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలను అమలు చేసి రొటీన్‌గా మాక్ డ్రిల్‌లు నిర్వహించాలన్నారు. భద్రతా ▶మిగతా 2లో..

కొండచుట్టూ ఆక్రమణల వివాదం

- రెండేళ్లుగా పట్టాల కోసం ఎస్సీల ఎదురు చూపులు
- కొండపై గ్రామ దేవత అలయ పునరుద్ధరణ

విశాలాంధ్ర-తాళ్లపూడి : తాళ్లపూడి మండలం రాగోలపల్లి రెవెన్యూ పరిధిలోకి వచ్చే 12 ఎకరాల కొండ పోరంబోకు భూమి రెండు వర్గాల మధ్య వివాదంగా కొనసాగుతోంది. కొన్ని సంవత్సరాలుగా ఆ కొండను సుబ్బారాయుడు మెట్టగా పిలుస్తూ, ఏటా సుబ్రహమణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుక ను నిర్వహించే ప్రదేశంగా సుపరిచితమైన స్థలం. కొండ దిగువ భాగం చుట్టూ ఎస్సీలకు చెందిన కుటుంబాలు స్థలాలను ఆక్రమించుకుని నివాసాలుగా మార్చు కున్నారు. ఇది కొండ పోరంబోకు భూమిగా ఉండటంతో ఆలయాల అభివృద్ధికి కొండపై స్థలంలో శ్రీకారం చుట్టారు. గతం లోనే ఏర్పాటు చేసుకున్న

ఇనుప ఫెన్సింగ్ లోపలే ఆలయ అభివృద్ధిని జరుపు తున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటు న్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల పడిపోతున్న గ్రామ దేవత ఆలయ పునర్నిర్మాణం చేయాలన్న తలంపుతో గ్రామస్థులు చేపట్టిన పనులను కొండ చివర ఉన్న కొంత మంది ఎస్సీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సర్వే నెంబరు 309లో 12 ఎకరాల భూమిలో అటు కొండ పైన ఆలయాలు ఉంటే, ఇటు ఎస్సీల నివాసాలు రెండు ఆక్రమణ లోనే ఉన్నాయి. కాగా ఇటీవల రాగోలపల్లికి చెందిన కొంతమంది మోతు బరులు భూమిని ఆక్రమిస్తున్నారని, మట్టి తవ్వేస్తున్నారని, వేలాది రూపాయలు కలప తరలించేస్తున్నారని, గతంలో కొంత భూమి ఆక్రమించుకోగా మరో కొంత స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని కొవ్వూరు ఆర్డీవో కు అదే గ్రామానికి చెందిన ఎస్సీలు ఫిర్యాదు చేశారు. దీనిపై తాళ్లపూడి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా తమ గోడు వినిపించుకోలేదని, మోతుబరులకే వంత పాడుతున్నారని ఇదే విషయాన్ని కొవ్వూరు ఆర్డీఓ వద్ద ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఈ వివాదంపై ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు కూడా సమావేశాలు నిర్వహించారు. రాగోలపల్లిలో కొనసాగుతున్న ఆలయ నిర్మాణాలు, ▶మిగతా 2లో..

సెక్యూరిటీగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మంగళవారం మెయిన్ గేటు వద్ద అప్పారావు అధ్యక్షతన సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని, జీవో ప్రకారంగా వేతనాలు మంజూరు చేయాలని నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరయ్యారు. ప్రసాద్ మాట్లాడుతూ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ సెక్యూరిటీ గార్డ్స్‌కు జీవో ప్రకారంగా జీతాలు మంజూరు చేయడం లేదని, శ్రమకు తగిన వేతనం రావడం లేదని శ్రమ దోపిడీకి గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 138 ప్రకారంగా ఈపీఎఫ్ ఈఎస్ఐతో కలిపి వేతనంగా రూ.18600 మంజూరు చేయవలసి ఉండగా కేవలం రూ. 12,100 మాత్రమే

మంజూరు చేస్తున్నారన్నారు. అదనపు డ్యూటీల బకాయి వేతనాలు, ఈపీఎఫ్ ఈఎస్ఐతో కలిపి తక్షణమే చెల్లించాలని, సెక్యూరిటీ గార్డ్స్‌కు వారాంతపు సెలవుతో పాటు 21 పండగ సెలవులు అమలు చేయాలని, సెక్యూరిటీ గార్డ్స్‌ను ఆప్కాస్‌లో విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన అన్నారు. యూనిఫారం రెండు జతలు అందజేసి కుట్టు కూలి మంజూరు చేయాలని ఆయన ▶మిగతా 2లో..

వీధి లైట్లు వెలగవా...!

- మారని వీధి దీపాల నిర్వహణ
- ఒకవైపు సిబ్బంది కొరత... మరోవైపు సామగ్రి కొరత

విశాలాంధ్ర-కొవ్వూరు: జిల్లాలో చాలా మున్సిపాలిటీలలో వీధిలైట్లు వెలగక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపల్ పాలకులకు, అధికారులకు చీమకుట్టైన అనిపించడం లేదు. ఒకవైపు సిబ్బంది కొరత.. మరోవైపు లైట్ల సామాగ్రి కొరత వేధిస్తున్నాయి. ఒక్కో మున్సిపాలిటీ మూడు లక్షల నుంచి ఐదు లక్షల వరకు నెల నెలా బిల్లులు చెల్లిస్తున్నా మరోవైపు పట్టణ ప్రజల నుండి పన్నుల రూపంలో వడ్డీతో సహా ముక్కు పిండి వసూలు చేస్తున్నా ప్రజలకు మాత్రం చీకటే మిగిలింది. ముఖ్యంగా పట్టణాలలో ప్రధాన కూడల్లో సైతం వీధిలైట్లు వెలగక పోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కొవ్వూరును ఉదాహరణగా తీసుకుంటే సుమారు ఐదు సంవత్సరాల క్రితం వరకు వీధిదీపాల నిర్వహణ కాంట్రాక్టు సంస్థలకు ఇచ్చి కధనడిపించేవారు. మున్సిపాలిటీ సదరు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు జాప్యంచేయడంతో ఆయా కాంట్రాక్టుదార్లు చేతులెత్తేసారు. కొవ్వూరులో మొత్తం 23 వార్డులు ఉండగా సిబ్బంది మాత్రం నలుగురే ఉన్నారు. అది కూడా కాంట్రాక్టు ఉద్యోగులే. ఒకరు స్తంభాలెక్కి మరమ్మతు చేస్తుంటే మరొకరు దానికి సంబంధించిన స్టాండ్ ను పట్టుకోవాల్సి వస్తుంది. ఇలా 23 వార్డులను పర్యవేక్షించాలంటే వారి తలకు మించిన భారం అవుతుంది. సాధారణ నిధులు సైతం అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టడంతో విద్యుత్ సామాగ్రి కొనలేని పరిస్థితుల్లో మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ దయనీయ పరిస్థితి పోవాలంటే మంచినీరు, వీధి దీపాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించాల్సి ఉంది.

చెల్లబోయినకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: కోర్టులు, చట్టాల పట్ల గ్రామీణ ప్రజల్లో అవగాహన కలిగిస్తూ సేవలందిస్తున్న ఐఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగా రావు స్ఫూర్తితో మరింత మంది

ముందుకు రావాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి న్యూటన్ అన్నారు. డిఎన్నార్ న్యాయ కళాశాల లీగల్ ఎయిడ్ సర్వీస్ సెల్ ద్వారా గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తూ చైతన్యం తెస్తున్న చెల్లబోయిన రంగారావును బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా న్యూటన్ మాట్లాడుతూ ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ సామాన్య ప్రజలను చైతన్య పరచడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బార్ సభ్యులు సతీష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర-లింగపాలెం: ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల నుంచి రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక చేసేందుకు జరిగిన పోటీలలో 145 మంది స్కేటింగ్ క్రీడాకారులు పాల్గొన్నారని శ్యావ్ స్కేటింగ్ క్రీడ కోచ్ షేక్ ఖాసిం తెలిపారు.

ఏలూరులో జరిగిన ఈ పోటీలు విజయవంతమయ్యా యని అన్నారు. జరిగిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో ఇన్‌లైన్ స్పీడ్ స్కేటింగ్‌లో 24 మంది, క్వాడ్ పోటీలకు 37 మందిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. నవంబర్ 1 నుంచి 5 తేదీలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని కోచ్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో జిల్లా స్కేటింగ్ స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బదేటి వెంకటరామయ్య, జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి రమేష్, జాయింట్ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారని తెలిపారు. ఈపోటీలను విశాఖపట్నంకు చెందిన రాష్ట్ర స్కేటింగ్ పరిశీలకులు రాంజీ పరిశీలించారని కోచ్ పేర్కొన్నారు. ఈసారి జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో ఉభయ పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపిస్తారని ఈయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మానవత్వం ప్రతి మనిషిలో ఉండాలి

డాక్టర్ జాన్ పీటర్ నినాదం

విశాలాంధ్ర-లింగపాలెం: సమాజంలో ఎటువంటి అసమానతలు ఉండకూడదని, అటువంటప్పుడే మన ప్రాంతం, మనదేశం అభివృద్ధిలో ఉంటుందని నిర్మలగిరి పుణ్యక్షేత్ర అధినేత డాక్టర్ రెవరెండ్ ఫాదర్ జాన్ పీటర్ అన్నారు. మత గురువుగా ఉంటూ అంతర్జాతీయ గ్రాడ్యు యేట్స్ క్రిస్టియన్ స్కూల్ ఆఫ్ థియాలజీ అమెరికా, భారత్ అనుసంధానమైన యూనివర్సిటీ నుంచి

డాక్టరేట్ సాధించిన ఈయన తన అనుభవాలను ధర్మాజీగూడెం వాసులతో పంచుకున్నారు. ఏమతం తక్కువ కాదని ఎవరికి ఇష్టం వచ్చిన మతాన్ని వారు స్వేచ్ఛగా అనుభవించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు .ప్రతి ఒక్కరూ ఎదుటివారిని గౌరవించాలని అన్నారు. ప్రతి మనిషిలో ప్రతిభ ఉంటుందని వారికున్న ప్రతిభను సమాజానికి ఉపయోగపడే విధంగా వినియోగించాలని అన్నారు. ఉన్నత ఆశయాలను లక్ష్యంగా చేసుకొని ప్రతి వ్యక్తి ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈసందర్భంగా ధర్మాజీగూడెనికి చెందిన పలువురు ఫాదర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, జిల్లా దళిత నాయకుడు ముల్లపూడి సుమన్, రెవెన్యూ అధికారి భీమడోలు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ జాన్ పీటర్ జాన్ అమెరికా,ఫ్రాన్స్, జర్మనీ,ఇటలీ,ఇంగ్లాండ్ దాదాపు 15 దేశాలలో పర్యటించారు. అమెరికాలో చదవటమే గాక ఈ దేశంలోనే డాక్టరేట్ సాధించారు. 2023-24లో డాక్టరేట్ పొందారు. ప్రతి ఒక్కరిలో మానవత్వం మూర్తీభవించాలని, మానవత్వం అనేది ప్రపంచమంతా విస్తరించాలనేదే తన నినాదమని ఈయన అన్నారు.

డాక్టర్ల నిరసనకు మద్దతు

విశాలాంధ్ర - వేలేరుపాడు : తమ సమస్యలు పరిష్కరించమని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు సున్నం శ్రీరాములు దొర అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశ వర్కర్లతో కలిసి నల్ల బ్యాడ్జిలు ధరించి సంఘీభావం తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో సేవలు అందిస్తున్న వైద్యుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్యులు లేకపోవడం వలన పేద ప్రజలు వైద్యం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వైద్య సిబ్బంది కూడా డాక్టర్స్ లేకపోవడం వలన పలు సేవలు అందించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వైద్యుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి వారు విధుల్లోకి చేరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, సచివాలయం ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్, 104 సిబ్బంది, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

భద్రత కల్పించాలి (1వ పేజీ తరువాయి)

అన్నారు. పిఎఫ్ ఈఎస్ఐ ఖాతాలో జమైనది ఎప్పటికప్పుడు సెక్యూరిటీ గార్డ్‌కు తెలియపరిచేం దుకు ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలని, ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో నిత్యం రోజుకి 4,000 మంది పైనే వైద్య సౌకర్యం నిమిత్తం వస్తున్న పేషెంట్లకు, వారి బంధువులకు పార్కింగ్ స్థలం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని, పార్కింగ్ సమస్య తీర్చాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్. అనిల్ కుమార్, ఎం. జాన్ బాబు, కాటూరి రాజు, కె. వెంకటేష్, వి. వెంకటరమణ, షఫీ ఖాన్, మీరాబి రత్నం, ఎం. వెంకటలక్ష్మి, ఎస్. వెంకటలక్ష్మి, రామలక్ష్మి, వి.దుర్గాభవాని, గీతా దుర్గాభవాని తదితర సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి (1వ పేజీ తరువాయి)

వృత్తాలు, జోన్లు ఏర్పాటు చెయ్యాలని, ప్రజలు కూడా ప్రమాదాలు జరిగే సమయంలో అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించా లని ఆదేశించారు. వార్షిక భద్రతా శిక్షణ క్యాలెండరు, భద్రతా మాన్యువల్, భద్రతా బుక్‌లెట్ ద్వారా కార్మికులకు అవగాహన కల్పించడం, భద్రతా ప్రమాణాలను ఖచ్చి తంగా పాటించడం జరగాలన్నారు. ఎమర్జెన్సీ అలారం సిస్టమ్ సజావుగా పనిచేయడం, సెన్సర్ యాక్టివేషన్ ద్వారా జిల్లా అధికారులను అప్రమత్తం చేయడం వంటి అంశాలను పగడ్బందీగా అమలు చెయ్యాలని ఆదేశం చారు. భద్రతా చర్యలపై ప్రతి ఫ్యాక్టరీ 30 రోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలని, ఈ నెలలో ప్రతి ఫ్యాక్టరీలో మాక్ డ్రిల్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ఇందులో ఆన్-సైట్, ఆఫ్-సైట్ భద్రతా చర్యలు, మాక్‌డ్రిల్ ఫలితాలు, హెచ్చరిక వ్యవస్థ పనితీరుపై ఎప్పటికప్పుడు సమా వేశాలు నిర్వహించి నివేదికలు అందజేయా లన్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే ఆటోమేటిక్ అలారం, ఎస్ఎమ్ఎస్ సిస్టమ్ ద్వారా సంబంధించిన అధికారులు వెంటనే అప్రమత్తం కావలసిన వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జియం పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారి కె. కృష్ణమూర్తి, ఐటిడిఏ పిఓ కె. రాములు నాయక్, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పీజే అమృతం, జిల్లా స్కిల్ డెవలప్మెంటు అధికారి యన్.జితేంద్రబాబు, జిల్లా మత్స్యశాఖ డీడీ బి.నర్సయ్య, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి యస్.బి. శేఖరు, వివిధ శాఖల అధికారులు, వివిధ పరిశ్రమలు సేఫ్టీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మినహాయింపు (1వ పేజీ తరువాయి)

బదిలీ చేయాల్సిన 2,180 ఎకరాల భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలపై స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయించబడ్డాయని ఆయన తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్ 9(1)(ఎ) మరియు 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలు చేయబడుతుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా తెలిపిందన్నారు. ఈ మినహాయింపు కేవలం రైతుల పక్షాన జరిగే భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. డెవలపర్లు, యూనిట్లు లేదా స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎస్ఈజెడ్) అభివృద్ధి కార్యక్రమాల కోసం జరిగే లావాదేవీలకు మాత్రం ఈ మినహాయింపు వర్తించదని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు ప్రభుత్వంపై నమ్మకం పెంచే సానుకూల చర్యగా నిలుస్తుందని. రైతులు తమ భూముల బదిలీ ప్రక్రియలో ఈ మినహాయింపు నిబంధనలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు.

విజయవంతం చేయండి

(1వ పేజీ తరువాయి)

ఎత్తు 41.15 మీటర్లకు కుదించాలని కేంద్ర దుష్టపన్నాగాన్ని త్రిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా, పీఠమెక్కినాక ఒక రకంగా మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులను ప్రభుత్వం దగా చేసిందని విమర్శించారు.

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ తలపెట్టే ఛలో ఐటీడీఏ కార్యక్రమానికి గిరిజనులు,పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కృష్ణచైతన్య పిలుపునిచ్చారు. కుక్కునూరులో జరిగిన సమావేశంలో సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, ఐతా సురేష్ బాబు, కురాకుల బాబూరావు, వెంకటాచారి, పాపారావు, రమణయ్య, నగేష్, సోమరాజు, రమేష్, నవీన్, వెంకట్, మారయ్య, ఎర్రయ్య పాల్గొన్నారు. వేలేరుపాడులో జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం దారయ్య, సీపీఐ సీనియర్ నాయకులు ఎండి మునీర్, మండల కార్యదర్శి బాడిశ రాము, కరటం వెంకటేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, బంధం అర్జున్, తాటి దుర్గారావు, మడకం దుర్గారావు,తెల్ల మహేష్,బంధం ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

మెగా మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం: పేద ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించేందుకే వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆరుగొలను సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. మండ లంలో ఆరుగొలను సొసైటీ ఆవరణలో ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సౌజన్యంతో మానవతా స్వచ్ఛంద సంస్థ, ఆరుగొలను సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళ వారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపును సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ ప్రారంభించారు. ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్యులు మెడిసిన్, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్, దర్మటాలజీ, ఈ ఎన్ టి., సైకియాట్రి, డెంటల్, రేడియాలజీ ఎక్స్‌రే, ఈ.సి.జి. వంటి వైద్య విభాగాల నిపుణులు సేవలు అందించారు. కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆరుగొలను, దండగర్ర, కొత్తూరు, లింగారాయుడుగూడెం గ్రామ ప్రజలు హాజరయ్యారు. 365 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానవతా అధ్యక్షుడు జె. రాజేంద్ర కుమార్, సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వీర వెంకట సత్యనారాయణ ,రిటైర్డ్ ప్రిన్సిపల్ కె వి.రామారావు, సెక్రటరీ మిరియాల కిషోర్, ట్రెజరర్ యర్రా ఆంజనేయస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం :జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమలపురంలో పనిచేస్తున్న పధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు పాఠశాల ఆన్లైన్ పనులకు ఉపయోగ పడేందుకు వీలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్

ఇండియా, జంగారెడ్డిగూడెం టౌన్ బ్రాంచి మేనేజర్ పి.రమాసతీష్‌కుమార్ సుమారు 30 వేల రూపాయల విలువ గల కంప్యూటర్, హెచ్.బి మానిటర్, డెల్ సి.పి.యు, కీబోర్డ్, మౌస్ లను బహూకరించారు. వారి దాతృత్వాన్ని ఎస్.ఎం.సి చైర్మన్ వెలగల సత్యనారాయణ, సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.భీమరాజు, గ్రామ పెద్దలు, దాతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ జంగారెడ్డిగూడెం టౌన్ బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మృతి

విశాలాంధ్ర - కలిదిండి: గుండెపోటుతో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుబ్బారావు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం కలిదిండిలో గొరిపర్తి సుబ్బారావు(83) తెల్లవారు జామున స్వగృహంలో గుండె పోటుకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు.

టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, రాజి, బి.కె నాని, టీడీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, వైసీపీ నాయకులు సుబ్బారావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వివాదం (1వ పేజీ తరువాయి)

వివాదాలపై తాళ్లపూడి తహశీల్దారును పాత్రి కేయులు వివరణ కోరగా ఈ సమాచారం చెప్పటం కుదరదని తహశీల్దార్ లక్ష్మీ లావణ్య వెల్లడించారు. కాగా కొండ చుట్టూ నివసిస్తున్న ఎస్సి కుటుంబాలకు కొంత మందికి పట్టాలున్నాయని, మరి కొంత మంది నివాసాలున్న వారు పట్టాల కోసం గత రెండు సంవత్సరాలుగా పట్టాల కోసం ప్రయత్నిస్తున్నా పట్టించుకోవడం లేదన్నది కూడా ఒక వాదన గా వినిపిస్తున్నారు. వివాదం సమసి పోయేందుకు ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

విశాలాంధ్ర -చింతలపూడి: రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ నవంబర్ 3 నుంచి సమ్మె చేస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి అనుబంధం) చింతలపూడి శాఖ అధ్యక్షురాలు వెలగాడ అనురాధ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీలలో గత రెండు సంవత్సరాలుగా చనిపోయిన, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు తిరిగి అవుట్సోర్సింగ్ విధానంలో పనులు కల్పనలో జరుగుతున్న జాప్యాన్ని మున్సిపల్ కార్మికుల ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతాల నుండి యాక్సిస్ బ్యాంకులోకి మళ్ళించుకోవాలని, కార్మికులపై ఒత్తిడి ఆపాలని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా వర్క్‌ఆఫ్ నేచర్‌ను బట్టి ప్రస్తుతం పనిచేస్తున్న ఇంజనీరింగ్ ఆఫీస్ సిబ్బంది వారికి వేతనాలు పెంచి చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు, కార్మిక సంఘం నాయకులు కంచర్ల గురవయ్య పాల్గొన్నారు.

డాగ్‌స్క్వాడ్ విస్తృత భద్రతా తనిఖీలు

విశాలాంధ్ర-కైకలూరు: ఏలూరు జిల్లా ఏలూరులో డాగ్ స్క్వాడ్ విస్తృత భద్రతా తనిఖీలను ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై నిర్వహించారు. ఏలూరు జిల్లా ఏ.ఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్, ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్

ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా డాగ్ స్క్వాడ్ సిబ్బంది కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్. శ్రీనివాస్ విస్తృత భద్రతా తనిఖీలు కైకలూరు టౌన్ పరిధిలో చేపట్టారు. ఈ తనిఖీలు కైకలూరు బస్టాండ్, రైల్వే స్టేషన్, పరిసర దేవాలయాలు, లాడ్జిలు, సినిమా థియేటర్ ప్రాంతంలో నిర్వహించారు. రద్దీ ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా కార్యకలాపాలు ఉన్నాయో లేదో జాగ్రత్తగా పరిశీలించారు. ఈ చర్యల ద్వారా ప్రజల భద్రతను బలోపేతం చేయడం, నేరాలను ముందస్తుగానే అరికట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులను గమనించిన వెంటనే డయల్ 112 కు లేదా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లలో సమాచారం ఇవ్వాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. మసీదు సెంటర్, ఏరియా బస్టాండ్ సెంటర్లో ఆటోల వలన ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న ఆటో డ్రైవర్ల యూనియన్ సభ్యులను, డ్రైవర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

16న బికెఎంయు జిల్లా కార్యవర్గం

విశాలాంధ్ర - ఏలూరు: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు) ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం అక్టోబర్ 16న ఏలూరులో జరుగుతుందని బి కే యం యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల గురవయ్య, బండి వెంకటేశ్వర రావు తెలిపారు.

సమావేశం ఈనెల 16 వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఏలూరు సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జరుగుతుందన్నారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ లతోపాటు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బి కే ఎం యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు పాల్గొంటున్నారని వారు తెలిపారు. ఏలూరు జిల్లాలో సంఘ సభ్యత్వం, గ్రామ సంఘాల ఏర్పాటు, భూ పోరాట కేంద్రాలు ఎంపిక, వన సంరక్షణ సమితులపై సమీక్ష, ఏజెన్సీ ఏరియాలో దశాబ్దాల తరబడి గిరిజనులు గిరిజన ఇతరులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలకై, నూజివీడు నియోజకవర్గంలో పేదలు సాగు చేస్తున్న వేలాది ఎకరాలకు పట్టాలకై ఆందోళన తదితర గ్రామీణ పేదల సమస్యలపై సమావేశంలో చర్చించి, కార్యాచరణ రూపొందించనున్నట్టు గురవయ్య, వెంకటేశ్వరరావు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ విఫలం

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలం చెందిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస రావు విమర్శించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరి ష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా భజంత్రీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 12వ పిఆర్సి ప్రకటించి, 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను ఔట్సోర్సింగ్ విధానంలో విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర కార్పొరేషన్, మున్సిపల్, నగర పంచాయతీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల నిష్ప త్తిని పెంచాలని, పర్మినెంట్ కార్మికుల పెండింగ్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల బ్యాంకు ఖాతాలు బలవంతంగా యాక్సిస్ బ్యాంకుకు మార్చరాదని, కార్మికుల

పదవీ విరమణ వయోపరిమితి 62 సంవత్సరా లకు పెంచాలని, కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి మున్సిపల్ కాలనీలో నిర్మించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 3వ తేదీ నుండి పూర్తిస్థాయిలో సమ్మెకు సమాయత్తం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డి గార్ల నాగబాబు, కార్యనిర్వాహక అధ్యక్షులు యలగాడ శివకుమార్, యూనియన్ సభ్యులు బంగారు రాజు, బంగారు సురేష్, నాగేశ్వరరావు, అర్జీ సత్యవతి, బంగారు అక్కమ్మ, తోట శాంతి, బంగారు లక్ష్మి, పడ్డాది భవాని, భాస్కరరావు, కోన మధుమతి, మాడుగుల భవాని, పైడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

విశాలాంధ్ర - చింతలపూడి : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలు, పెండింగ్ పీఎఫ్‌లను విడుదల చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక చింతల పూడి ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సంఘం అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, 15 నెలల పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం కాంట్రాక్టర్ వ్యవస్థ మారినప్పటికీ మళ్లీ అదే కాంట్రాక్టరుకు టెండర్ వచ్చినా పాత బకాయిలు విడుదల చేయకుండా పాత పిఎఫ్‌లు విడుదల చేయకుండా అదే కాంట్రాక్టర్‌కు టెండర్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా వైద్య అధికారులను ప్రశ్నించారు. ఆ కాంట్రాక్టర్ పెండింగు బిల్లులు చెల్లించకుండా అతనికే కాంట్రాక్టు ఇవ్వడం వెనుక జిల్లా వైద్యాధికారుల ప్రమేయం ఉందని. తక్షణం కాంట్రాక్టర్‌ను మార్చి పాత బకాయిలు చెల్లించి కొత్త కాంట్రాక్టర్కు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారులకు సూచించారు. ఈ ధర్నాలో రాజు,నాగరాజు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సమాఖ్య అధ్యక్షులుగా శ్రీనివాసరామరాయ్

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: తెలుగు సాహితీ సమాఖ్య నూతన కమిటీ ఎన్నికైంది. తాడేపల్లిగూడెం మున్సిపల్ మాజీ కౌన్సిలర్, అపుస్మా జిల్లా ఉపాధ్యక్షులు, శ్రీ షిర్డిసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ జంగా శ్రీనివాసరామరాయ్ ప్రతిష్టాత్మకమైన తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా తెలుగు పండితులు డాక్టర్ పసుపులేటి రామచంద్రరావు, కోశాధికారిగా ఆడిటర్, వాసవి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్, నారాయణ వెంకటరమణరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ గట్టిం మాణిక్యాలరావు వ్యవహరించారు.

సాహితీ సమాఖ్య గౌరవ అధ్యక్షులు ఈతకోట భీమశంకర్ రావు, పూర్వాధ్యక్షులు మండా బ్రహ్మాజీ, పైలు శ్రీనివాసరావు, గరికపాటి బాపయ్య శర్మ, కొడాలి రమేష్ బాబు, చినుకు జనార్దన్ రావు, పాల్వంచ తిరుమల వెంకన్న, కొమ్మన అప్పారావు, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, చాంద్ బీబీ, మండపల్లి నాగేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కాటం జగపతిబాబు, S/o. సురేష్, డోర్‌నెం. 6-181, జగన్నాథపురం, గణపవరం (గ్రా), గణపవరం (మం), ప॥గో॥జిల్లా., పిన్ : 534198. నేను ది.18.09.2025 తేదిన మా ఇంటి నుంచి గణపవరం సెంటర్ కు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం.U6961972 బ్యాగులో నుండి పడిపోయినది.

ఎంత వెదికననూ దొరకలేదు.కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

మెప్మాను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: పట్టణ ప్రజలకు మెరుగైన జీవనోపాదుల కల్పనకు మెప్మా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కలెక్టర్ తన ఛాంబర్లో "మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్" గోడపత్రికను మంగళవారం మెప్మా అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు వివిధ వ్యాపారాల స్థాపనకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయించుకునేందుకు "మెప్మా లైవ్లీ హుడ్ ప్రమోషన్ సెల్"ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక కుటుం బం, ఒక వ్యాపార వేత్త అనే నినాదంతో 51 రకాల వ్యాపార యూనిట్‌లకు సంబంధించిన బ్రోచర్‌ను రూపొందించి నట్టు తెలిపారు. బ్రోచర్లను పట్టణ ప్రజలకు పంపిణీ చేయాలని సూచిం చారు. గోడపత్రిక ఆవిష్కరణలో ఇన్‌చార్జి మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.హెప్సిబా, జిల్లా లైవ్లీ హుడ్ స్పెషలిస్ట్ సిహెచ్ నానీబాబు, జిల్లా ఐబీ సి.హెచ్.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా, విధుల బహిష్కరణ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మెడికల్ కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రెండో రోజైన మంగళ వారం జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట విధులు బహిష్కరించి,ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, గౌరవ అధ్యక్షులు జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్‌కు గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, దీంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, కార్మికుల వేతనాలు నుండి కటింగ్ చేసి పిఎఫ్ ఖాతాలకు జమ చేయాల్సిన డబ్బులు కార్మికుల ఖాతాలకు జమ చేయలేదని, వెంటనే మూడు నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, పిఎఫ్ ఖాతాలకు జమ చేయాల్సిన డబ్బులు జమచేయాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ దయాదాక్షిణ్యా లపై కార్మికుల జీవితాలు ఆధారపడి ఉన్నాయన్న విధంగా పరిస్థితి ఉందని, ఇది సరికాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఏఐటియుసి నాయ కులు రాజు, మేరీ,దమయంతి, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అనారోగ్యంతో ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో సహాయపడు తుందని పోలవరం నియోజకవర్గ శాసన సభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలో సరిపల్లి, అచ్యుతాపురం, పరింపుడి, ఎర్రంపేట, బయ్యన్నగూడెం

గ్రామాలకు చెందిన మందపాటి వెంకటేశ్వరరావు, తాడేపల్లి సత్యవతి, లంక శ్రీనివాస్, కంచర్ల రాజేష్, వరద వెంకట్రావు, టెక్కం సోమ సాయి గణేష్ లకు చిర్రి బాలరాజు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసినట్టు మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట రవి తెలిపారు.

SIR C R REDDY COLLEGE OF ENGINEERING
Vatluru, Eluru-534007, W.G.Dist., Phone : 08812 - 230840, 230565
(Approved by AICTE)

B.TECH SPOT ADMISSION:- 2025 -26

Few seats are vacant in the following branchs after final phase counselling of APEAPCET-2025

CSE,ECE, EEE, IT,MECH & CIVIL

Institute SPOT ADMISSIONS will be held on .15.10.2025 (Wednesday) at 10:00 AM. Interested candidates may attend with all original certificates.Tution fee Rs.54,200/-. The eligibility and admission will be as per the APSCHE guidelines.

sd/-
Principal

మంచినీటి వసతి కల్పించండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : మూడు నెలలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కన్నాయిగుట్ట, తిర్లాపురం ప్రజలకు వెంటనే మంచినీటి వసతి కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కారం ధారయ్య ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిర్లాపురం పంచాయతీలో మంచినీటి వసతులు పరిశీలించి స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా మంచినీటి కోసం గోదావరి నీటిని తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నదిలోకి దిగి నీళ్లు తెచ్చుకోవడం ఎంతో ప్రమాదమని తెలిసినప్పటికీ తప్పడం లేదని స్థానికులు వాపోయా రన్నారు. నిత్యం గోదావరి ఒడ్డు దిగి నీళ్ల బరువుతో ఒడ్డు ఎక్కటం చాలా కష్టంతో కూడుకున్న పని అని, వెంటనే ప్రభుత్వం స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కారం బొజ్జి, కారం రాజ్యలక్ష్మి, గొంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో ఘనంగా పోసిన చెంచు రామారావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -కైకలూరు: రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచు రామారావు జన్మదిన వేడుకలు కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం కైకలూరు పట్ట ణంలో ఘనంగా నిర్వహించారు. రామారావు పుట్టిన రోజు సందర్భంగా కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అన్నదానంతోపాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పరసా ఏడుకొండలు, జిల్లా అధ్యక్షులు పరసా వీర్రాజు చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కైకలూరు పట్టణంలోని ఎస్టీ కాలనీలో నివసిస్తున్న పేదలకు, అంగన్వాడీలోని చిన్నారులకు రొట్టెలు,పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కైకలూరు మండల అధ్యక్షులు కట్టా నాగబాబు, మండవల్లి మండలం అధ్యక్షులు బొర్రా సత్యనారాయణ, కలిదిండి మండల అధ్యక్షులు కట్టా పాండు రంగారావు, తదితర గౌడ సంఘ నేతలు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేసిన కార్మికులు

విశాలాంధ్ర -నరసాపురం : మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నవంబరు 3 నుంచి సమ్మెకు పిలుపు ఇస్తున్నట్లు సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వ ర్యంలో కమిషనర్ ఎం. అంజయ్యకు మంగళ వారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా విధుల్లో మరణించిన, రిటైర్డైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలన్నారు. 12వ పి.ఆర్.సి.ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, మధ్యంతర భృతి 30 శాతం ఇవ్వాలని, 2011 నుంచి జనగణన జరగనందున, ప్రాంతాల విస్తీర్ణం పెరిగినందున ఆయా మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీలలో పెరిగిన జనాభా కనుగుణంగా కార్మికుల నిష్పత్తిని పెంచాలని తదితర సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఆరేటి మృత్యుంజయరావు, యార్లగడ్డ రాము, నీలం ప్రసాదబాబు, సింగంపల్లి అమరావతి, గుమ్మడి శ్రీనివాసరావు, ఊటుకూరి రత్తయ్య, పెదిరి విజయకుమార్, గుమ్మడి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.12 (1744533)/2019/డి.బి తేది : 13-10-2025

భీమవరం పురపాలక సంఘం పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్టు టెండరు నోటీసు నెం.16 (1-2)/BHI//General/2025-26/E1 & టెండరు నోటీసు నెం.16 (3-5) BHI//General/2025-26/E1 లోని జనరల్ నిధుల నుండి 5 పనులకు** గాను **రూ. 88.15 లక్షలతో** ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా **టెండర్లు** జి.వో.ఎం.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుచున్నవి. మిగిలిన వివరములు ఇప్రొక్యూరుమెంటు మార్కెట్టు **www.tender.apeprocurement.gov.in** లేదా కమిషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో. జిల్లా (**సెల్ 9849906540, 9849906543**) వారిని సంప్రదించగలరు.

కమిషనరు,
భీమవరం పురపాలక సంఘం

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం : ఈనెల 17, 18 తేదీల్లో తాడేపల్లిగూడెంలో జరగనున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల నిర్వహణ ఏర్పాట్లు సమీక్షించేందుకు తాడేపల్లిగూడెం ఏరియా కార్యకర్తల సమావేశం మంగళవారం సిపాయిపేట లోని భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో జరిగింది. ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ తాడేపల్లి గూడెంలో రాష్ట్ర సమితి సమావేశాలు 25 సంవత్సరాల తర్వాత జరుగుతున్నాయని, కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించడానికి కార్యకర్తలు క్రమశిక్షణతో కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం రెండు రోజుల పాటు రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కుంటున్న సమస్యలపై ఈ సమావేశాల్లో చర్చించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన పోరాటాలను రూపొందిస్తారని తెలిపారు. ఏరియా సమితి కార్యదర్శి మండలపర్తి హరీష్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కళింగ లక్ష్మణరావు, కార్యనిర్వాహక కార్యదర్శి కే .లక్ష్మీనారాయణ, కోశాధికారి అల్లం కుమారస్వామి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు , భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, మాట్లాడారు. వివిధ అనుబంధ సంఘాల నాయకులు మాదాసు సత్యనారాయణ, ఆంజనేయులు, జగన్నాథం, మేళం నాగేశ్వరరావు, ఆనంద్, ముత్యాలు, కుమారి, వెంకటలక్ష్మి, కొడమంచిలి చంద్రరావు, మార్గపూడి కాటమ రాజు, పిల్లంగోళ్ల మురళి, కోటం నాగేశ్వరరావు, జి.సత్యనారాయణ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

సమ్మెకు సమాయత్తం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: సుదీర్ఘ కాలంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపుమేరకు నవంబరు 3వ తేదీ నుంచి సమ్మెకు సమాయత్తమవుతున్నట్లు ఏఐటీ యూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షులు ఓవి రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ వాసు చెప్పారు.

ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తాడేపల్లిగూడెం శాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబుకు సమ్మె నోటీసు సమర్పించారు. ఈసందర్భంగా ఓవి రాజు, తాడికొండ వాసు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని, మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని,మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీల్లో పెరుగుతున్న విస్తీర్ణంకు అనుగుణంగా కార్మికుల నిష్పత్తి పెంచాలని,డైలీ వేజ్ కార్మికులను అవుట్ సోర్సింగ్ లోకి తీసుకోవాలని తదితర డిమాండ్స్ పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చినట్టు చెప్పారు. ఏఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు, కొడమంచిలి ముత్యం, మార్గపూడి కాటమరాజు, అల్లం కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో యూనియన్ బ్యాంకుకు తప్పిన భారీ నష్టం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : యూనియన్ బ్యాంకుకు పెను ప్రమాదమే తప్పిందని చెప్పవచ్చు. షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించిన అగ్ని ప్రమాదంలో కేవలం స్వల్ప నష్టంతోనే బయటపడ్డారు. సెయింట్ ఆన్స్ కళాశాల యాజ మాన్యం అందించిన సమాచారంతో వెంటనే బ్యాంక్ అధికారులు ఫైర్ సేఫ్టీ అధికారులకు సమాచారం చేరవేయడంతో భారీ అగ్ని ప్రమాదాన్ని నివారించగలిగారు. ఏలూరు నగరంలోని శనివారపు పేట ప్రాంతంలో ఉన్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రాంగణంలోని యూని యన్ బ్యాంకులో నుండి మంగళవారం ఉదయం మంటలు రావడాన్ని గమనించిన కళాశాల యాజమాన్యం వెంటనే బ్యాంకు మేనేజర్ రాజాజీకి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన బ్యాంకు మేనేజర్ వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం తెలియజేసి వెంటనే సంఘటన స్థలానికి చేరుకు న్నారు. అదే సమయంలో హుటా హుటిన అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంట లను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. బ్యాంకు కార్యాలయం అన్నివైపులా తలుపులు మూసి ఉండడంతో పాటు పైనుండి విపరీతమైన పొగ బయటకు వస్తుండడంతో బ్యాంకు అద్దాలను పగులగొట్టి లోపల పరిస్థితిని అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలించారు. అనంతరం బ్యాంక్ అధికారుల సహాయంతో వెనుక డోర్ నుండి అగ్నిమాపక సిబ్బంది లోపలికి ప్రవేశించారు. తదనంతరం వాటర్ క్యానన్లతో అగ్ని ప్రమాదాన్ని నివారించడంతో స్వల్ప నష్టంతో యూనియన్ బ్యాంక్ బయటపడింది. అయితే కేవలం బ్యాంకు రశీదు పుస్తకాలు, ఇతరత్రా మినహా ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, ఖాతాదారు లకు సంబంధించిన రికార్డులు, బ్యాంకు కంప్యూ టర్లు, సర్వర్లకు ఎటువంటి ప్రమాదం సంభవించ లేదని మేనేజర్ రాజాజీ చెప్పారు. ఈ ప్రమాదంతో యూనియన్ బ్యాంకు కార్యకలా పాలు మంగళవారం అశోక్ నగర్ బ్రాంచ్ ద్వారా నిర్వహించారు. బుధవారం కూడా ఆ బ్రాంచి నుండే కార్యకలాపాలు కొనసాగిస్తామని మేనేజర్ రాజాజీ స్పష్టం చేశారు.

అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు

– జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-టి నరసాపురం: అనుమతులు లేకుండా మందు గుండు సామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని బొర్రంపాలెం, టి.నరసాపురం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న దీపావళి బాణసంచా దుకాణాల స్థలాలను మంగళవారం ఎస్సై ఎం.జయ బాబు, తహశీల్దార్ టి.సాయిబాబా సిబ్బందితో పరిశీలించారు. దుకాణాలు ఏర్పాటు దారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా సామాగ్రి దుకాణ దారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని దుకాణాలు నివాస గృహాలు, స్కూల్స్, పెట్రోల్ బంకులకు దూరంగా 50 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిషాపులో అగ్ని నిరోధక సామాగ్రి ఉంచాలని తెలిపారు. ప్రతి దుకాణంలో నీరు, ఇసుక బిందెలు తప్పనిసరిగా ఉంచాలన్నారు. లైసెన్స్ ప్రకారం మాత్రమే పరిమిత పరిమాణంలో మందుగుండు నిల్వ చేయాలని రాత్రి 10 గంటల తర్వాత విక్రయాలు చెయ్యకూడదన్నారు. ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు ట్యాంకర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. ఆయన వెంట విఆర్ఓ ఫణి కుమార్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఆకుల మౌనికకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: అబాకస్ కోర్సులో ఎందరినో తీర్చిదిద్దుతూ సేవలందిస్తున్న పట్టణానికి చెందిన ఆకుల మౌనికను సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాల జీస్ ఉత్తమ అధ్యాపకురాలి అవార్డుతో సత్కరించింది. విద్యా శాఖ కోఆర్డినే టింగ్ అధికారి డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, ఇగ్నో ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ కె. హేమలత చేతుల మీదుగా మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మౌనిక అందుకున్నారు. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో దేశంలోని 125 మంది ఉపాధ్యా యులు, అధ్యాపకులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక జరగగా వారిలో ఆకుల మౌనిక ఒకరు.

క్షయవ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఓ) కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్ మంగళవారం సందర్శించారు. క్షయ వ్యాధిపై సమీక్ష నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రోగ్రామ్ అమలు విధానం, రోగుల చికిత్సా స్థితి, మందుల సరఫరా, సిబ్బందికి అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలపై సమగ్రంగా పరిశీలించారు. క్షయ వ్యాధి నియంత్రణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గణపవరం సిబ్బంది పనితీరు పై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జూలాది విల్సన్ బాబుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. క్షయ రోగుల గుర్తింపు, చికిత్సా నియమాల అమలు, ప్రజల్లో అవగాహన పెంపుపై డాక్టర్ ధీరజ్ ప్రత్యేక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఎస్‌టీఎల్ ఎస్‌టీబీ సూపర్వైజర్ గిరి, శ్రావణ్, ఎమ్ ఎస్ యోహాన్, బాలమురళి పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - దేవరపల్లి : కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరిగిందని ఎన్నికల హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమిప్రభుత్వం నెరవేర్చిందని వివో ఎల జిల్లా అధ్యక్షురాలు స్వరూప రాణి పేర్కొన్నారు . దేవరపల్లిలో మంగళవారం వి ఓ ఏ కార్యా లయం వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా స్వరూప రాణి మాట్లాడుతూ గత ఆరున్నర సంవత్సరాల నుండి జీవోను రద్దు చేయా లని విన్నవించిన గత వైసిపిప్రభుత్వం మూడు సంవత్సరాలు పని చేసిన వి ఏ ఓలను తొలగించాలన్న జీవోను రద్దు చేయాలని వివరించిన పట్టించుకోలేదని , కూటమిప్రభుత్వం అధికారంలోకొస్తే జీవోను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన నారా చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ అధికారంలోకి వచ్చిన వెంటనే జీవోను రద్దు చేశారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఇదేవిధంగా తమకు పూర్తి సహకారం ఇస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా వివో ఎల జిల్లాఅధ్యక్షురాలు స్వరూప రాణి మాట్లాడుతూ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు 220 మంది వివో ఏలకు ఐడి కార్డులు యూనిఫార్మ్ అందజేస్తున్నట్లు తెలిపారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గద్దె రమాదేవి వివో ఏలు మండపాటి సుజాత వంగల వరహాలు పల్లి నాగమణి శాంత కుమారి సిహెచ్ విజయకుమారి అధిక సంఖ్యలో వివోఏలు పాల్గొన్నారు.

క్రీడలే ఆయన ఊపిరి

విశాలాంధ్ర - దేవరపల్లి : క్రీడలే ఆయన ఊపిరి క్రీడాకారుల ఆయనకు వారసులు దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయునిగా గతం లో పీడిగా ప్రస్తుతం శాప్‌డైరెక్టర్ గా ఉండి తన శిష్యులకు ఉద్యోగావకాశాలు కల్పించి ఉభయ పశ్చిమగోదావరి జిల్లాల్లోనే కాకుండా రాష్ట్రంలో అన్ని జిల్లా లలో క్రీడాకారులకు పేరం రవీంద్రనాథ్ స్ఫూర్తిగా నిలిచారు . చింతలపూడి మండలంలో సమ్మెట వారి గూడెంలో జన్మించిన పేరం రవీంద్రనాథ్ క్రీడాకా రునిగా గుర్తింపు పొంది 1983లో పిఈటిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు అప్పటినుండి టీ నర్సాపురం ప్రగడవరం దేవరపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో పీడీగా పనిచేస్తూ ఎంతోమంది క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిన పేరం రవీంద్రనాథ్ ఆరవ తరగతి నుండే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ గత 43 సంవత్సరాల నుండి వివిధ క్రీడలలో 2200 మెడల్స్ సాధించారు వాటిలో 850 బంగారి పథకాలు కూడా ఉన్నాయి. కోకో టెన్నికాయిట్ కబాడీ సపక్ తక్రా వాలీబాల్ బాస్కెట్బాల్ అథ్లెటిక్స్ వంటి పది క్రీడలలో తమ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి జిల్లా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో అనేక పథకాలు రావ టానికి పేరం రవీంద్రనాథ్ చేసిన కృషి ఎంతో అభినందనీయం అప్పటి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు దేవరపల్లి మండల లో పర్యటనలో భాగంగా జిల్లా పరిషత్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన వెలిపాడ్ వద్ద పేరం రవీంద్రనాథ్ సేవలను గుర్తించి ఆయనను ప్రప్రథమంగా శాప డైరెక్టర్గా నియమించారు. అప్పటినుండి రాష్ట్రస్థాయిలో ప్రారంభ రవీంద్రనాథ్ పిడిగా ఎంతో పరిచయం పొందారు . ఈ క్రమంలో పేరం రవీంద్రనాథ్ రామన పాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రథమ ఉపాధ్యాయునిగా పదోన్నత పొంది బాధ్యతలు స్వీకరించారు ప్రస్తుతం 2025 డీఎస్సీలో దేవరపల్లి మండలంలో ఆయన శిష్యులు క్రీడాకారులైన 14 మంది తోపాటు ఆయన శిష్యులు మరో ఇద్దరు పీడీలుగా ఉద్యోగం పొందారు రవీంద్రనాథ్ ఇచ్చిన క్రీడ శిక్షణలో ఆ క్రీడాకారులు ఎంతో ప్రతిభ పొంది డిఎస్సి లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా దేవరపల్లిలో ఆయన స్వగృహం వద్ద మంగళ వారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఈటిగా తాను 1983లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన వెంటనే క్రీడాకారులకు తన వంతు సహకారంగా ఏదో చేయాలనే తపనతో ఇప్పటివరకు దాదాపు 3,000 మంది క్రీడాకారులను తయారు చేశానని ఆయన తెలిపారు. 674 మంది ఉద్యోగాలు పొంది అనేక పోస్టులలో స్థిరపడ్డారని తెలిపారు భారత దేశంలో అన్ని చోట్ల ఏదో ఒక నగరంలో తన శిష్యుడు ఉద్యోగంలో ఉండటం తనకు ఎంతో ఆనందదాయకంగా ఉందని రవీంద్రనాథ్ తెలిపారు. దేవరపల్లి మండలం చెందిన రవీంద్రనాథ్ శిష్యులు గూడూరి శ్రీనివాస్ తంగెళ్ళ మునేశ్వరరావు కవల వెంకటలక్ష్మి కవల పోసి రత్నం కవల సుజాత నించిన కోళ్ల ఓం ఫన్నీ కుక్కల వీర వెంకట సత్యనారాయణ కండెల్లి చంటి జక్కం శెట్టి శ్రీనివాస్ దువ్వాపు అశోక్ కల్లేపల్లి మాణిక్యం తంగెళ్ల గంగాధర్ వనజ చెన్నారావు సతీష్ అశోకులు ఉభయగోదావరి జిల్లాలలో అనేక గ్రామాలలో గల పాఠశాలలలో పీఈటీలుగా ఉద్యోగాలు పొందారు.

భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా పాలక మండలి వ్యవహరించాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా పాలక మండలి వ్యవ హరించాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. దేవాదాయ శాఖ ఆధీనంలోని స్థానిక ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతనంగా ఏర్పాటైన పాలక మండలి సభ్యులు తిలక్ రోడ్డులోని నగర టీడీపీ కార్యాలయంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సభ్యులు మళ్ల వెంకటరాజు, నక్కెళ్ల

హరి ప్రసాద్, కోల రామచంద్రరావు, పెండ్యాల ఉమామహేష్, శీలం సత్యనారాయణ, కొప్పుల రామేశ్వరి, తంగెళ్ల పద్మావతి, కల్లూరి సూర్యనాగ వెంకట అన్నపూర్ణ, అరవ సువర్చల, వంజరపు శంకర్, ఉప్పులూరి సూర్య కుమారిలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు వారికి ఇబ్బంది లేకుండా కావాల్సిన సౌకర్యాలు కల్పించి, భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా పాలన సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల స్వయం కృషితో రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - సీతానగరం: ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చేసిన రోడ్డును రైతులు స్వయం కృషితో రోడ్డు నిర్మాణం చేసుకు న్నారు. మండలంలో వంగలపూడి గ్రామ పంచాయతీ నుంచి పెదకొండపూడి వరకూ గల 3.5కిమి రోడ్డు ఏళ్ల తరబడి నిర్లక్ష్యం చూపడంతో అస్తవ్యస్తంగా మారడంతో రైతు లు తమ స్వయం కృషితో రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఈ రహదారిలోనే గత ప్రభు త్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన సుమారు నాలుగు ఎకరాలకు భూమి ఉంది. అయినప్పటికీ ఈ రోడ్డు నిర్మాణం చేయకపో వడంతో లబ్ధిదారులు సైతం ఇళ్ల నిర్మాణం చేయడానికి ఆసక్తి చూపడం లేదు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు అనుకోని సుమారు మూడు వేల ఎకరాలు రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ రైతులకు ఎరువుల, సాగు అనంతరం పండిన పంటలను తెచ్చు కోవడానికి రైతులకు ఇబ్బందులకు గురి అవుతుండడంతో రైతులు స్వయం కృషితో రోడ్డు నిర్మాణం చేసుకోవడం జరిగింది అని రైతులు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణం పై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో నిర్మాణం చేస్తే సొంత ఇంటి కల సాకారం చేసుకొనే విధంగా గృహ నిర్మాణాలు చేసే అవకాశం ఉందని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

యాచకులపై స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : జిల్లా అంతట ఘాట్లు , వాటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలలో కొంతమంది యాచ కులు ఎక్కడపడితే అక్కడ రోడ్లపై మద్యం సేవించి నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 193 మందిని స్వాధీనంలోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్.పి. డి.నరసింహ కిశోర్ తెలిపారు. ఇలా స్వాధీనంలోకి తీసుకున్న 193 మంది యాచకులలో 18 మందిపై నేర చరిత్ర ఉన్నట్లు గుర్తించామని, విచారణ అనంతరం వీరిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, మిగిలిన 175 మందికి కౌన్సిలింగ్ నిర్వ హించి వారి స్వగ్రామాలకు పంపించినట్లు తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఇంకా కొనసాగిస్తామని, ఇకపై అలాంటి వ్యక్తు లను గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జీఎస్టీ 2.0 తో నిర్మాణ రంగానికి ఊతం

అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 తో నిర్మాణ రంగానికి ఊతం లభించిం దని అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ అన్నారు. సూపర్ జీఎస్టీ , సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో మంగళవారం నిర్మాణ రంగంలోని విని యోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సామాన్యుల సొంతింటి కల సాకారానికి జీఎస్టీ సంస్కరణలు ఎంత గానో దోహదపడతాయని అదనపు కమి షనర్ పేర్కొన్నారు. తాజా జీఎస్టీ సవ రణతో నిర్మాణ సామాగ్రిలో అయ్యే ఖర్చులో 10-15 శాతం ఆదా అవు తుందన్నారు. అలాగే తగ్గిన ధరలు ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా పాత, కొత్త ధరల బోర్డులను దుకా ణాల ముందు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభు త్వం స్పష్టంగా సూచించిందన్నారు. అనంత రం భవన నిర్మాణదారుల అభిప్రా యాలను సేకరించారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజవల్లి, డిప్యూటీ అసి స్టెంట్ కమిషనర్ (కమర్షియల్ ట్యాక్స్) ఎస్.వెంకట రమణ, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, డిప్యూటీ సిటీ ప్లానర్లు నాయుడు, శ్రీనివాస్, ఎగ్జిక్యూ టివ్ ఇంజనీర్ మదర్సా అలీ, పలువురు భవన నిర్మాణ దారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - సీతానగరం: విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరి యల్ పంపిణీ చేసిన యు టిఎఫ్, జన విజ్ఞాన వేదిక. మండలంలోని రఘుదేవపురం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో జరిగిన మెటీరియల్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఎమ్ శ్యామలాదేవి, మం డల యుటిఎఫ్ అధ్యక్షులు ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి ఆర్ పాపారావు పుస్తక ఆవిష్కరణ చేసి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు. మండల వ్యాప్తంగా పరీక్ష రాయ బోతున్న 180 మంది విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్స్ సర ఫరా చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. ఆంజనేయులు, ఇస్మా ఖాన్, జి. శేఖర్, బి. కామరాజు, కె. గంగాధర్, పి. సత్తిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు

విశాలాంధ్ర - కోరుకొండ : తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజక వర్గం కోరుకొండలో వైఎస్ ఆర్సిపి అమలాపురం పార్లమెంటరీ ఇంచార్జ్ జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యా లయాన్ని ముట్టడిం చారు. రాష్ట్రంలో కల్తీ మద్యం నిరోధించాలని, బెల్ట్ షాపులు తొలగిం చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కల్తీ మద్యాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగా టం ఆడుతుందని ఆరోపించారు. రాజ నగరం నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయ కులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నక్క రాంబాబు, మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కంటే వినయ్ తేజ, రాజానగరం జడ్పిటిసి వాసంశెట్టి పెద్ద వెంకన్న, బొరుసు బద్రి, సూరిశెట్టి కుటుంబరావు, బీసీ సెల్ అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు, సూరిశెట్టి అప్పలస్వామి, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో యూ కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామం రావు రామాయమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఐసిడియస్ ప్రాజెక్ట్ పిఠాపురం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గారాణి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం అంత ర్జాతీయ బాలికా దినోత్సవం అక్టోబర్ 11న నిర్వహిస్తామని, ప్రతీ సంవత్సరం ఒక అంశంపై అవగాహన కల్పించడం, ఈ సంవత్సరం "బాలికగా నాతోనే మార్పు-రండి ముందుకు "అనే అంశం పై అవగాహన కల్పించామని, ప్రపంచ వ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, విద్య, పోషణ, చట్ట పరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస, బలవంతపు బాల్య వివాహం పై, వివక్షత పై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేడుకలు అక్టోబర్ 11 నుండి 18 వరకు జరగనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వి సారమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలని, విద్యార్థి లక్ష్యం వైపు తప్ప వ్యామో హలవైపు మరలకూడదని తెలియజేసారు, బాలికలు విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు, బాలికను రక్షిద్దాం, బాలికను చదివిద్దాం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవలని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఎవరైనా ఆకతాయిలు బాలలను ప్రేమ పేరుతో వేధించిన, లైంగిక వేధింపులకు గురి చేసిన బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా పోలీసు 112కి ఫోన్ చేసి సమాచారం అదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి దుర్గారాణి, ఐసిడియస్ సూపర్వైజర్ వి సారమ్మ, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపా ధ్యాయులు సిహెచ్‌వివి కృష్ణ మూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు ఎం రమణమ్మ, ధనలక్ష్మి, సిహెచ్ సత్యవతి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా నారా వారి నకిలీ మద్యం సరఫరా

మాజీ ఎమ్మెల్యే సత్తి

విశాలాంధ్ర - పెదపూడి : అధికారుల నిర్లక్ష్యంతో అనపర్తి నియోజకవర్గంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే, వైసిపి కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు. మంగళవారం "విశాలాంధ్ర"తో సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఒకపక్క సీఎం చంద్రబాబు నకిలీ మద్యం, బెల్ట్ షాపులపై బెల్టు తీస్తాం, తాట తీస్తాం అని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా నారావారి నకిలీ మద్యం రాజ్యమేలుతోందని, రాష్ట్రవ్యాప్తంగా కల్తీ మద్యం సరఫరా అవుతుందని నకిలీ మద్యం తయారీని కూటమి నేతలు పరిశ్రమగా మార్చివేశారని మండిపడ్డారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం రాజకీయ ఒత్తిళ్లకు తలవంచి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిం చడం దురదృష్ట కరమని ఆయన అన్నారు. నకిలీ మద్యం వ్యాపారాన్ని తక్షణమే అరికట్టి, బెల్టు షాపులు మూసివేయాలని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు.

లైసెన్స్ దారులకు భద్రతా సూచనలు

విశాలాంధ్ర - కరప : దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని ఫైర్ క్రాకర్స్ లైసెన్స్ దారులకు మండల రెవెన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించామని తహశీల్దార్ టీ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఫైర్ క్రాకర్స్ లైసెన్స్ కలిగి షాపులు నిర్వహిస్తున్న లైసెన్స్ దారులు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. షాపులకి, షాపులకి మధ్య దూరం ఉండాలని, వాటర్ నింపిన డ్రమ్ములు, ఇసుక బకెట్లు, ఏర్పాటు చేసుకోవాలని సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫైర్ అధికారులు, షాపులో యజమానులు పాల్గొన్నారు.

బాణసంచ విక్రయాల్లో జాగ్రత్త పాటించాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : బాణాసంచా విక్రయాల్లో విక్రయించే ప్రతి ఒక్కరు తగు జాగ్రత్త పాటించాలని ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తప్పవని పెద్దాపురం డిఎస్పి హరిహర రాజు అన్నారు. మంగళవారం జగ్గంపేటలోని బాణా సంచా విక్రయ స్థల పరిశీలన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. విక్రయి దుకాణాల్లో ప్రతి షాపునకు నీరు, ఇసుక పక్కన పెట్టాలని ఆయన అన్నారు. అగ్ని ప్రమాద నివారణ యంత్రాలను ప్రతి షాపు వద్ద తప్పనిసరిగా ఉంచాలన్నారు. జగ్గంపేట మండలంలోని 15 షాపులుకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. షాపులకు సంబంధించి ఫైర్, రెవెన్యూ, పోలీస్ స్టేషన్ సంబంధిత శాఖల ఆధ్వర్యం లో విక్రయాలు సాగించాలని ఎటువంటి విద్వేషమైన చర్యలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు. బాణాసంచా కాల్పుల్లో కుటుంబ పెద్దలు తగు జాగ్రత్త పాటించాలన్నారు. బాలలకు కాటన్ దుస్తులు ధరించాలని దగ్గర ఉండి వారికి ఇష్టమైతే కల్పించాలన్నారు. స్థల పరిశీలనలో డిఎస్పి వెనుక జగ్గంపేట సిఏ వైఆర్‌కె శ్రీనివాస్, తహసిల్దార్ రమేష్, జగ్గంపేట అగ్నిమాపకాధికారి రత్నం రాజు, ఫైర్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌లో ఆదిత్య యూనివర్సిటీ ప్రొఫెసర్ కుమార్ రెడ్డి సత్తా

విశాలాంధ - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న "ఎంవి కుమార్ రెడ్డి', ఆదివారం (12/10/25) మంగళగిరి శంషేర్ ఖాన్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 7వ నేషనల్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్షిప్ 2025లో సత్తా చాటి మూడు పతకాలు గెలుచుకున్నారని ప్రో ఛాన్సలర్ డా ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. స్విమ్మింగ్‌లో బ్రేస్ట్ స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం (25%ఎ) బట్టర్ ఫ్లైలో కాంస్య పతకం (25%ఎ) ఫ్రీ స్టైల్‌లో రజతం పతకం (25%ఎ) గేలుచుకున్నారనీ వివరించారు. ఈ సందర్భంగా విజేత ఎంవి కుమార్ రెడ్డిను ప్రో ఛాన్సెలర్ డా ఎన్ సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సెలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, ప్రో వైస్-ఛాన్సెలర్ డా ఏ రమేష్, డీన్ వైకెఎస్ సుబ్బారావు, విభాగాఫపతి డా మానం రవీంద్ర, తదితరులు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు.

బండారులంక హైస్కూల్‌కు మెగావైడ్ 30 లక్షల విరాళం

విశాలాంధ్ర - అమలాపురం : మెగా వైడ్ హైదరాబాద్ వారు బండారులంక శ్రీ పేరిరామేశ్వరశర్మ శ్రీ బాసిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు భవనం నిమిత్తం, 30 లక్షల రూపాయలు మంజూరు చేశారు. పేరి శ్రీనివాసశర్మ కృషితో జరిగిన ఈ బృహత్తర కార్యక్రమం గురించి ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుకి బండారులంక తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పిచ్చికశ్యామ్ ఆధ్వర్యంలో శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతాశంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీత, ఏడుకొండలు, ఎమ్మెల్యే ఆనందరావుని కలసి ఎస్టిమేటెడ్ 43 లక్షలు చూపించగా దాత ఇచ్చిన 30 లక్షల రూపాయలు కాక మిగిలిన 13 లక్షలు మంజూరు చేశారు. పనులు వెంటనే ప్రారంభించాలని సర్పంచ్‌ని ఆదేశించారు. ఈ సందర్భంగా శంకరమూర్తి మాట్లాడుతూ 13 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆనందరావుకి ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ అధ్యాపకుడిగా డాక్టర్ యర్రంశెట్టికి అంతర్జాతీయ గుర్తింపు

విశాలాంధ్ర - రాజోలు : ఉన్నత విద్యా విభాగంలో ఉత్తమ అధ్యాపకుడిగా మలికిపురం మండలం కేశనపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్స్, ఫిజిక్స్ అధ్యాపకుడు డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. ఈ మేరకు ఆయన ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్జాతీయ సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అంతర్జాతీయ ఉత్తమ అధ్యాపకుడు పేరు తో అవార్డును అందుకున్నారు. దేశ వ్యాప్తంగా ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రముఖ యూనివర్సిటీలు, విద్యా సంస్థలు నుంచి 625, అమెరికా నుంచి 75 నామినేషన్లు రాగా అందులో 125 మందికి ఆయా రంగాల్లో అవార్డులు అందించగా..ఉన్నత విద్యలో తాను అంతర్జాతీయ అవార్డు అందుకోవడం చాలా గర్వకారణంగా ఉందని డాక్టర్ యర్రంశెట్టి చెప్పారు. అలాగే ఈ అంతర్జాతీయ సంస్థలో ఆయనకు జీవిత కాలపు సభ్యత్వాన్ని కూడా అందజేసినట్లు చెప్పారు. డిగ్రీ విద్యలో పరిశోధనలను మేళవించి బోధన చేయడం, విద్యార్థులను మార్గ దర్శనం చేయడం, అలాగే తమ జీవిత సాఫల్యతకు ఆయన మార్గం చూపిన తీరును విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి ఆయనకి ఈ అవార్డును అందజేసినట్లు ముఖ్య అతిథులు కొనియా డారు. కేంద్ర విద్యా శాఖ, ఏఐసీటీఈ, అనువాదిని ఏఐ చీఫ్ కో ఆర్డినేటింగ్ అధికారి డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కరరావు, ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి హరిబాబు, ఇగ్నో ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ కె సుమలత, అమెరికా అలాబామా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జిపి నాగరాజు తదితర ప్రముఖులు ఆయనకి ఈ అవార్డుని అందజేశారు.

రీసెర్చ్‌లో కిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థుల ఘనత

- పది ఐసిఎంఆర్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లకు ఎంపిక

విశాలాంధ్ర - అమలాపురం : ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) ప్రతి సంవత్సరం మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను రీసెర్చ్ ప్రాజెక్ట్‌లకు ఎంపిక చేసి, ప్రతి ప్రాజెక్ట్‌కు లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుంది. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా వచ్చిన అనేక వేల ప్రాజెక్ట్ ప్రపోసల్‌ల నుండి మొత్తం 454 రీసెర్చ్ ప్రాజెక్ట్‌లను ఐసిఎంఆర్ ఎంపిక చేయగా అందులో పది ప్రాజెక్ట్‌లు అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థులవి కావడం సంతోషకరం. వారిలో చెవి, ముక్కు మరియు గొంతు విభాగ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థి డా కె విద్యా సాగర్, ప్రసూతి మరియు స్త్రీ రోగ చికిత్సా విభాగ పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు డా ఆర్ల సాహితి, డా ఎంవి జ్యోతిర్మయి, డా వల్లూరు శ్రీలేఖ, డా ఎస్ లిఖితాంజలి, డా ఎడా అలేఖ్య, డా కోటిపల్లి సత్య దేవిక, డా పెరుగు నవ్యశ్రీ, డా వర్ధనపు యామిని, డా కాటంశెట్టి గీతిక కావడం విశేషం. వీరందరూ తమ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం కూడా పొందుతారని కిమ్స్ డీన్ డా ఆనంద్ ఆచార్య తెలిపారు. జాతీయ స్థాయిలో దీటుగా నిలిచే రీసెర్చ్ ప్రాజెక్టులు చేసి ఐసిఎంఆర్ ప్రోత్సాహకాలకు ఎంపిక అయ్యేలా విద్యార్థులకు మార్గదర్శకం చేసిన సంబంధిత విభాగాధిపతులు మరియు అధ్యాపక బృందాన్ని, కిమ్స్ చైర్మన్ కెవివి సత్యనారాయణ రాజు, ఎండి కె రవి కిరణ్ వర్మ, కిమ్స్ డీన్ డా ఆనంద్ ఆచార్య ప్రశంసించారు.

ఐపిపిబి ప్రమాద బీమా రూ.15 లక్షల చెక్కు అందజేత

విశాలాంధ్ర - జగ్గంపేట : ఇటీవలే ప్రమాదవశాత్తు మరణించిన జెడ్ రాగంపేటకు చెందిన కట్టు పద్మనాభం కుటుంబ సభ్యులకు రూ.15 లక్షల భీమ నమూనా చెక్కును కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ నవీన్ కుమార్ అందజేశారు. జగ్గంపేట పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నవీన్ మాట్లాడుతూ 160 సంవత్సరాలుగా తపాలా శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను 550 రూపాయలు 10 లక్షలు, 755 భీమా తీసుకుంటే 15 లక్షల రూపాయలు ఆ కుటుంబానికి అండగా అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆటో డ్రైవర్ల అందరికీ ఈ ప్రమాద బీమా పథకాన్ని తీసుకుంటామని అదేవిధంగా గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ఈ బీమా పథకానికి ప్రచారం కూడా నెరవేరుస్తున్నామన్నారు. సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాజ్ కుమార్ మాట్లాడుతూ వ్యాపారస్తులకు ఉచితంగా డిజిటల్ లావాదేవీలు చేసుకునేందుకు డాక్ పే మర్చంట్ స్టాండ్ ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ బాబు, జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు జీనుమణి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, రాష్ట్ర డైరెక్టర్లు కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, కిర్లంపూడి మండల టిడిపి అధ్యక్షులు వీరం రెడ్డి కాశి బాబు, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, గోకవరం మండలం టిడిపి అధ్యక్షులు పిల్ల చంటిబాబు, క్లస్టర్ ఇంచార్జి పైడిపాల సూరిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, బద్ది సురేష్, విశాఖపట్నం రీజియన్ అధికారి విపి సురేష్, కాకినాడ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కే రాజ్ కుమార్, పెద్దాపురం పోస్టల్ సబ్ ఇన్స్పెక్టర్ బ్రహ్మం నాయక్, మేనేజర్లు బాలాజీ రాజ్, శ్రీనిధి స్థానిక తపాలా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన

విశాలాంధ్ర - కొత్తపేట : స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమంను నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. కార్యాలయం బయట ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించాలని, తగ్గిన రేట్ల కంటే ఎక్కువగా వసూలు చేసే వ్యాపా రులపై తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వినియోగదారులకు తగ్గిన రేట్లు స్పష్టంగా కనిపించేలా ప్రతి షాపు వద్ద రేట్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాయని చెప్పారు. వినియోగదారులు ఏవైనా సందేహాలు, ఫిర్యాదులు ఉన్న ప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1915 ద్వారా సంప్రదించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బి వెంకటేశ్వరరావు, కొత్తపేట గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కరరావు, వానపల్లి గ్రామ సర్పంచ్ పల్లి భీమారావు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మిద్దె ఆదినారాయణ, ఎండీఓ నరేష్, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్, కంఠం శెట్టి శ్రీని వాస్, పాలూరుసత్యానందం, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మ స్వీకార మహోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం త్రిరత్న బుద్ధ విహార్ ప్రాంగణంలో బౌద్ధ దమ్మ స్వీకార మహోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. అనంతరం గౌతం బుద్ధిని వద్ద పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బుద్ధ విహార్ వ్యవస్థాపకులు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ ఐదు లక్షల మందితో 1956 అక్టోబర్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారని అన్నారు. బౌద్ధం ద్వారా ఆధ్యాత్మిక పేరణ కలిగించిన గౌతమ్ బుద్ధుడని అన్నారు. ప్రముఖ రచయిత పిల్లి రాం బాబు రచించిన రివల్యూషనరీ బుద్ధ పుస్తకంను ఈ సందర్భంగా ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి టీఎస్ఆర్ కే ప్రసాద్, బుద్ధ విహార్ చైర్మన్ నాగబత్తుల ప్రసాదరావు, జనరల్ సెక్రెటరీ డిబి లోక్, సభ్యులు కాశి వెంకట్రావు, కాశి రాంబోది, ములపర్తి సత్యనారాయణ, పెనుమాల చిట్టిబాబు, డి నాగేశ్వరరావు, ధోనిపాటి నాగేశ్వరరావు, కోడూరి రామ్మూర్తి, మానేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై సమావేశం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ఎన్డిఏ కూటమి ప్రభుత్వం అమలకు తెచ్చిందని ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ చెప్పారు. బివిఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సత్యప్రభ జ్యోతి ప్రజ్వలన వెలిగించి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఎంపీడీవో ఎంవిఆర్ కుమార్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నూతన జిఎస్టి 2.0తో అన్ని వర్గాలకు మేలు చేయడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు తీసుకువచ్చింది అన్నారు. సరుకుల ధరల వ్యత్యాసంతో జిఎస్టి నూతన విధానంతో ధరలు తగ్గి ప్రజలకు కొనుగోలు శక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు.

తిరుమల తరహాలో వాడపల్లి అభివృద్ధి

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : తిరుమల వెళ్ళి బ్రహ్మోత్సవాలను దర్శించుకోలేని భక్తులందరూ వాడపల్లి వచ్చి బ్రహ్మోత్సవాలను దర్శించుకునేలా, తిరుమలను తలపించే విధంగా వాడపల్లిలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మంగళవారం ఆయన స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బండారు దంపతులకు, కుటుంబ సభ్యులకు దేవస్థానం అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం కళ్యాణ మహోత్సవంలో, హోమాల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే బండారు దంపతులు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి స్వామివారి అనుగ్రహం కూడా తోడు అవ్వాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. తిరుమల తర్వాత మరో తిరుమలగా వాడపల్లి క్షేత్రం వెలుగులీనుసుందని, స్వామి వారి వైభవం ప్రపంచమంతా చాటేలా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శానిటేషన్, టాయిలెట్ సౌకర్యాలతో భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోంటున్నామన్నారు. శాసనసభ్యునిగా తాను, నూతన చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు మాస్టర్ ప్లాన్ అమలుకు తీవ్రంగా కృషిచేస్తున్నామని తెలిపారు. వకుళమాత అన్నదాన కేంద్రం మరి కొన్ని రోజుల్లోనే నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మరో 8 ఎకరాలు పార్కింగ్ ఏరియా కోసం ఫిల్లింగ్ చేయనున్నట్లు, 54 రూములు, 4 డార్మెటరీలతో మరో పెద్ద భవనం నిర్మించబోతున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి నుంచి అటు రాజమహేంద్రవరం నుంచి గాని ఇటు రావులపాలెం నుంచి గాని అన్ని వైపుల వాడపల్లికి వచ్చేలా రహదారుల అభివృద్ధి చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని 57 గ్రామాల నుంచి వాడపల్లికి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందరూ తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

ముమ్మిడివరంలో ఆర్టీసీ బస్టాండ్ పునరుద్ధరించాలి

నాలుగో రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర - కాట్రేనికోన : నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో ఆర్టీసీ బస్టాండ్‌ను పునరుద్ధరించి, ప్రయాణికులకు బస్సు సౌకర్యం కల్పించాలని రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్య పరిష్కారం కోసం రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. స్థానిక బస్టాండ్ విషయమై కొన్నేళ్లుగా పలుసార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండును ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం చేసి వ్యాపారం చేసుకోవడం తగదన్నారు. బస్సుల కోసం ప్రయాణికులు రోడ్లపై ఎండకు ఎండి వానకు తడుస్తూ ఇక్కట్లు పడుతున్నా ఎవరికీ పట్టదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయి అని రవికుమార్ ప్రశ్నించారు. ప్రజా సమస్యను తీర్చాల్సిన అధికార, నాయకగణం చోద్యం చూస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలకు పార్టీలకు అతీతంగా నాయకులు ప్రజలు మద్దతు పలకడం విశేషంగా చెప్పుకోవచ్చు. బీఎస్పీ నాయకులు వాకపల్లి భీమారావ్, బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ఇంచార్జ్, ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్చార్జ్ బడుగు భీమేశ్వరరావు, బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్, ట్రెజరర్ పందిరి శ్రీనివాస్, ముమ్మిడివరం నగర పంచాయతీ కన్వీనర్ తదితరులు ముమ్మిడివరం యంఆర్ఓ కార్యాలయం ఎదుట జేఏసీ షెడ్‌లో రవికుమార్ దీక్ష శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెంటనే బస్టాండ్ ను పునరుద్ధరించి దీక్షను విరమింప చేయాలని నియోజకవర్గ ప్రజలతోపాటు, ఇతర ప్రాంతాలు వారు కోరుతున్నారు.

ఆదిత్య యూనివర్సిటీలో ముగిసిన వర్క్ షాప్

విశాలాంధ్ర - గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రెండు వారాల పాటు నిర్వహించిన "స్ట్రక్చరల్ డిజైనింగ్ యూజింగ్ ఎటాబ్స్" మరియు "బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూజింగ్ ఆటో క్యాడ్" అనే రెండు వర్క్‌షాపులు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమాలు ఇండస్ట్రీ-ఓరియెంటెడ్ ట్రైనింగ్‌లో భాగంగా రూపొందించబడ్డాయి. విద్యార్థులు భవన నిర్మాణ రూపకల్పన మరియు డ్రాఫ్టింగ్ విషయాలలో ఆధునిక సాఫ్ట్‌వేర్‌ల వినియోగాన్ని నేర్చుకున్నారు. ఈ వర్క్‌షాపులకు విభాగ కో ఆర్డినేటర్లు దానమ్ నాయిలీ నేతృత్వం వహించగా, ట్రైనింగ్ సెషన్లను నిపుణులు దాలి నాయుడు నిర్వ హించారు. ముగింపు సమావేశంలో ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ, "సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఆధారిత డిజైనింగ్ టూల్స్‌లో నైపుణ్యం పెంపొందించుకోవడం భవిష్యత్తు కెరీర్ అభివృద్ధికి కీలకం" అని తెలిపారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ వైఈవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ, "ఇటువంటి వర్క్‌షాపులు విద్యార్థులలో సాంకేతిక ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని సిద్ధం చేస్తాయి" అని పేర్కొన్నారు. విభాగాధిపతి నాగ సాయి విద్యార్థుల ప్రాక్టికల్ అవగాహనను అభినందిస్తూ, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వర్క్‌షాపుల ద్వారా పొందిన నైపుణ్యాలు భవిష్యత్తులో ప్రాజెక్ట్ రూపకల్పన , నిర్మాణ రంగంలో తమకు ఎంతో ఉపయోగపడతాయని సంతృప్తి వ్యక్తం చేశారు.

డ్వాక్రా రుణాలు అవకతవకలపై విచారణ చేయాలి

విశాలాంధ్ర - కరప : కరప మండలం కూరాడ గ్రామంలో డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రుణాలు జరిగాయని వీటిపై సమగ్రం గా విచారం జరిపించి న్యాయం చేయాలని మంగళవారం ఎంపీడీవో మల్లాది వెంకట శ్రీనివాసరావుకు మహిళలు వినతి పత్రం అందించారు. కూరాడ గ్రామంలో 106 గ్రూపులు వేలంగి ఎస్బిఐ బ్యాంకు పరిధిలో ఉన్నాయని, 85 గ్రూపులకు సంబంధించి కోరాడ గ్రామంలో ఒక ఎస్బిఐ మొబైల్ కరస్పాండెంట్‌ను ఏర్పాటు చేయగా గ్రూపులకు సంబంధించిన మహిళలందరూ తమ రుణాలను ఎస్బిఐ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతి మన చెల్లించే వారమని డబ్బులు కట్టించుకుని, రసీదులు రాసి ఇచ్చేదని, బ్యాంకు పుస్తకాలలో స్టేట్మెంట్ వేసేది కాదని ఫిర్యాదులో తెలిపారు. ఎస్బిఐ బ్యాంకు నుండి స్టేట్మెంట్ తీసుకోగా కట్టిన సొమ్ములు గ్రూపుల ఖాతాలకు జమ కాలేదని వినతిలో పేర్కొన్నారు. దీనిపై సమగ్రంగా విచారణ చేపట్టాలని ఉప్పుమణి, వి ఉమ వెంకటరత్నకుమారి, వి సూర్యకుమారి, శివనేని అనంత లక్ష్మి, వెలుగుబంట్ల చంద్రలేఖ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

యానాంలో పిడుగుపాటు

స్లాబ్ పిల్లర్, విద్యుత్ పరికరాలు ధ్వంసం

విశాలాంధ్ర - యానాం : యానాం కురసాంపేట గ్రామంలో రెండు రోజులుగా అతి భారీ వర్షాలు కురవడంతో మంగళవారం ఉదయం భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో పిడుగు కొబ్బరి చెట్టు మీద పడి అదే గ్రామానికి చెందిన గుండాబతుల సూర్యనారాయణ ఇంటిపై కూడా పిడుగు పడి భారీ శబ్దంతో కాంక్రీట్ పిల్లర్ ముక్క ముక్కల లాగా చెల్లా చెదురైపోవడంతో ఆ కుటుంబస్తులతో పాటు ఆ గ్రామ ప్రజ లందరూ భయభ్రాంతులకు గురయ్యారు. నాలుగు టివిలు, ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లు కాలిపోవడం జరిగిందని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట పై క్షేత్ర స్థాయి పరిశీలన

విశాలాంధ్ర - రాజోలు : నియోజకవర్గంలో త్వరలో జరగనున్న డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, అర్డీవో మాధవి స్థానిక ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్‌తో కలిసి మంగళవారం పర్యటన ఏర్పాట్లు పై క్షేత్ర స్థాయి పరిశీలన చేసారు. కేశనపల్లి, మలికిపల్లి, శివకోడు గ్రామాలలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా కేశనపల్లి-శంఖరగుప్తం డ్రైన్‌కు ఇరువైపులా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను పవన్ కళ్యాణ్ పరిశీలిస్తారు. అనంతరం అక్కడి రైతులతో ముఖాముఖీ నిర్వహిస్తారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు, చేపట్టవలసిన పనులపై అధికారులతో సమీక్షిం చారు. ఈ కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ గొల్లపల్లి అమూల్య, డీఎస్పీ మురళి మోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్షిప్ పోటీలలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఏలూరు : నగరంలోని సిఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈనెల11,12 తేదీలలో నిర్వహించిన " నేషనల్ ఓపెన్ కరాటే ఛాం పియన్ షిప్-2025-26 పోటీలలో చాటపర్రు రోడ్డులోని వినాయక నగర్ నందు గల భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి, వివిధ కేటగిరీలలో బహు మతులు గెలుపొందారు. వెస్ట్ విద్యార్థులను జోన్ ఇన్ ఛార్జ్ శ్రీమన్నా రాయణ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ విద్యార్థిని,విద్యార్థులను కిరణ్ కుమార్, స్కూల్ కో - ఆర్డినేటర్ సంధ్యారాణి, ప్రత్యేకంగా అభినందించారు.

నవంబర్ 3 నుంచి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమ్మె

కార్పొరేషన్ కమిషనర్‌కు నోటీసు అందజేత

విశాలాంధ్ర - ఏలూరు : రాష్ట్రంలో నగర పాలక సంస్థలలో, పురపాలక సంఘాలలో, నగర పంచాయితీలలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బంది సమ స్యల పరిష్కారానికి నవంబర్ 3 నుండి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమ్మె చేయను న్నట్లు ఏఐటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, యూనియన్ ప్రధాన కార్య దర్శి ఎ.అప్పలరాజు తెలిపారు. నవంబర్ మూడో తేదీ నుండి జరిగే సమ్మె నోటీసును మంగళవారం నాడు కార్పొరేషన్ కమిషనర్ కు అందజేశారు. 11వ పిఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, బకాయిపడిన డీఏలను తక్షణం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ పేమెంట్స్ లో చెల్లించాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, సీనియర్స్ అం దరికీ ప్రమోషన్లు ఇవ్వాలని, ఔట్సోర్సింగ్ కాం ట్రాక్ట్, ఎన్ఎమ్ఆర్ లను రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ సిబ్బందికి నెలకి రూ. 26వేల కనీసవేతనం ఇవ్వా లని, అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరియు పెన్షన్ ఇవ్వాలని, ఎన్ ఎమ్ ఆర్ లకు హెచ్ఆర్‌పి డీఎతో కలిపి ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని, పీహెచ్ డ్రైవర్లగాను, ఫిట్టర్లు గాను, ట్యాప్ ఇన్స్పెక్టర్లుగాను ప్రమోషన్లు ఇవ్వాలని, ఔట్సో ర్సింగ్ కాంట్రాక్ట్ ఎన్ ఎమ్ ఆర్ లతో కలు పుకొని ఉద్యోగ కార్మిక సిబ్బం దికి బకా యిపడిన మూడు సంవత్సరాల యూనిఫామ్, కుట్టుకూలీ, టవల్స్, చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు తక్షణమే ఇవ్వాలని కోరు తూ సమ్మె నోటీసులో డిమాండ్ చేసినట్లు వారు తెలిపారు. కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూని యన్ సహాయ కార్యదర్శి ఎస్ ఎంవి సుబ్బారావు కోశాధికారి నారాయణరావు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించి నైపుణ్యాన్ని పెంపొందించాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాకా రులను మరింత ప్రోత్సహించి వారి నైపు ణ్యాన్ని పెంపొందించడం నాలుగు చోట్ల క్రీడా స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నట్లు శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. మంగళవారం దేవరపల్లిలో ఆయన స్వగృహం వద్ద విలేకరులతో మాట్లాడారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని ఆయన తెలిపారు. క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు షాపు చైర్మన్ అనిమిని రవి నాయుడు సహకారంతో రాష్ట్రంలో కొండేపి కుప్పం విజయనగరం పాయకరావుపేట లలో షాపు ఆధ్వర్యంలో క్రీడా స్టేడియంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికే కడపలో క్రీడా స్టేడియం ఉందని ఆ స్టేడియంలో 400 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. విజయనగరం స్టేడియం 60 ఎకరాలలో క్రీడా పాఠశాల నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్టేడియంలలో 14 రకాల క్రీడలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు దేవరపల్లి హైస్కూల్లో గతంలో క్రీడా వికాస కేంద్రం అసంపూర్తిగా నిర్మించి ఉందని దానిని క్రీడా వికాస కేంద్రంగా నిర్మించడానికి ప్రస్తు తం రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందని అవసరమైతే నిధులు పెంచడానికి కృషి చేస్తానని రవీంద్రనాథ్ తెలిపారు ఇదే విధంగా తిరు పతి, నెల్లూరు కాకినాడ విశాఖపట్నంలలో స్టేడియం లో 14 నుండి 16 క్రీడలలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు జాతీయ అంతర్జాతీయ క్రీడలకు పోటీలకు ఎంపికయ్యే విధంగా క్రీడాకారు లను తయారు చేస్తామని రవీంద్ర నాథ్ తెలిపారు. దేవరపల్లి మండ లంలో దేవరపల్లి చిన్నాయి గూడెం ఎర్రగూడెం హైస్కూలులో క్రీడా మైదానాలు ఎక్కువ విస్తీర్ణంలో ఉండటం వలన క్రీడలను అభివృద్ధి చేయటానికి తన వంతు సహకారం అందజేస్తానని పేరం రవీంద్రనాథ్ తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధికి షాప్ చైర్మన్ రవి నాయుడు సహకారం ఎంతో ఉందని ఆయన తెలి పారు. ఇదేవిధంగా తాను నన్నయ యూనివర్సిటీ క్రీడల అభివృద్ధి సభ్యునిగా బాధ్యతలు స్వీకరించాలని తెలిపారు. నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రసన్న ఎంతో సహకారం అందిస్తున్నారని ఆయన తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించాలని రవీంద్రనాథ్ వెల్లడించారు.

కోడిపందేల వ్యసనంతో హత్యకు దారి తీసిన మనస్పర్ధలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణానికి చెందిన వల్లూరి రాజా రమేష్‌కు కోళ్లను పెంచి కోడిపందాలు ఆడే అలవాటు ఉంది. ఈ నేపథ్యంలో బొద్దిరెడ్డి వెంకటేశ్వర్లకు కోడి పందాలు ఆడే అలవాటు ఉండటంతో (రాజా రమేష్ వెంకటేశ్వర్లు) వీరిద్దరి మధ్య కోడిపం దాల ఆటలలో పరిచయం ఏర్పడింది. దీంతో రాజా రమేష్ వెంకటేశ్వర్లు వద్ద పది లక్షల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించకపోవడంతో పదేపదే వెంకటేశ్వర్లు అప్పు ఇమ్మని అడగడంతో వెంకటేశ్వర్లను హత్య చేసేందుకు రాజా రమేష్ కుట్రప న్నాడు. అయితే ఈనెల మూడవ తేదీన నర్సీ పట్నం మండలంలో కోడిపందాలు ఉన్నా యని ముద్దాయి రాజా రమేష్ వెంకటేశ్వర్లను నమ్మించి ఒక కారులో తీసుకుని వెళ్ళాడు. ముందుగా హత్యకు అనుకున్న పథకం ప్రకా రం అతడికి ఒక కూల్ డ్రింక్‌లో మత్తు మందు కలిపి ఇచ్చాడు. వెంకటేశ్వర్లు స్పృహ కోల్పోవడంతో అతడిని ఎవరు లేని బురద రాళ్ల ఘాటీ వద్ద హత్య చేసి సాక్ష్యాలను చెరి పే ప్రయత్నం చేశాడు. మృతుడి వద్ద ఉన్న నగదును బంగారాన్ని దోచుకెళ్ళినట్లు ముద్దా యి రాజా రమేష్ వివరించినట్లు పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు తెలిపారు. నిజం ఎక్క డ బయట పడుతుందో అని రాజా రమేష్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడితే తన సోదరుడు ఆస్పత్రిలో చేర్పిం చారు. ఈ నెల 13వ తేదీ సోమవారం ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అవ్వగా అతడిని ప్రత్తిపాడు సిఐ అప్పారావు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపించినట్లు డీఎస్పి తెలిపారు.

కూటమి ప్రభుత్వ పాలకులను ఎండగట్టాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : నోటికొచ్చిన హామీలు ఇచ్చి ప్రజలను వంచనకు గురిచేసిన కూటమి ప్రభుత్వ పాలకులను తూర్పార బట్టాలని, ప్రజలకు జరి గిన మో సాన్ని వైసీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్లి వివ రించాలని మాజీమంత్రి వైసీపీ జిల్లా అధ్య క్షులు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాల కృష్ణ పిలుపు ఇచ్చారు. వైసీపీ సీనియర్ నాయకులు నక్కా రాజబాబు ఆధ ర్యంలో మంగళ వారం రాజవోలు గ్రామంలో వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రచ్చబండ కార్యక్రమం, రాష్ట్ర ప్రభుత్వ కల్తీ మద్యంపై కోటి సంతకాల సేకరణ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైసీపీ జిల్లా అధ్యక్షులు మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వైసీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజక వర్గఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చ కుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను ఇంకా మభ్యపెడుతూనే పాలన సాగిస్తోందని చెల్లుబోయిన అన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం దందాను నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతోందని డాక్టర్ గూ దూరి శ్రీనివాస్ ఆరోపించారు. సమావేశం లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రేణులు పాల్గొన్నారు.

గేమ్ చేంజర్‌గా గూగుల్ హైపర్ స్కేల్ డేటా సెంటర్

ఎంపీ మహేష్ హర్షం

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ సంస్థ విశాఖపట్నంలో హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయ డం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభి వృద్ధిలో ఒక గేమ్ చేంజర్‌గా మారనుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ సంస్థ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సంస్థ రానున్న ఐదు ఏళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ పెట్టుబడి విశాఖలో పెట్టనుందన్నారు. భారతదేశంలో ఈ కంపెనీకి ఇప్పటివరకు పెట్టిన అన్నిటికంటే ఇదే అతిపెద్ద పెట్టుబడి కాబోతోందని చెప్పారు. ఇక్కడ నుంచి 12 దేశాలతో సబ్ సీ- కేబుల్ విధానం ద్వారా అనుసంధానం జరుగుతుందని, దీనితో విశా ఖ గ్లోబల్ కనెక్టివిటీ హబ్‌గా మారనుందని సంతో షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రం లో అనేక ఐటీ సంస్థలను, పరిశ్రమలను తీసుకువచ్చి హైదరా బాద్‌ను చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. అదే విధంగా ఇప్పుడు చంద్ర బాబుతో పాటు నారా లోకేష్ సైతం ప్రత్యేక దృష్టికి సారిం చడంతో అనేక సంస్థలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయన్నారు. వీరిద్దరి చొరవతో గత 16 నెలల్లోనే రాష్ట్రానికి 11 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఇప్పుడు గూగుల్ డేటా కంపెనీలో రాకతో ఆంధ్ర ప్రదేశ్ యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ, నైపుణ్య అవకాశాలు లభించబోతున్నాయ న్నారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా నిరం తరం పనిచేస్తూ, మొన్న అమరావతికి క్వాం టం వ్యాలీ, నేడు విశాఖపట్నంకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ తీసుకువచ్చిన ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకి, ఐటీ పరిశ్ర మల మంత్రి నారా లోకేష్ కు ఎంపీ మహేష్ అభినందనలు తెలిపారు.